నాకు నచ్చిన నా కథ

# సంగీతజ్ఞానమూ...

"స రి గ మ ప ద ని స"
"స రి గ మ ప ద ని స"
సరళీస్వరం మొదటి పాదంలోని ఒక్కొక్క స్వరాన్నీ విడివిడిగా మాస్టారు చెప్పిన విధంగా కచ్చితంగా పలికింది సంగీత.
"స ని ద ప గ మ రి స"
"స ని ద ప మ గ రి స"
రెండో పాదాన్ని కూడా అపశ్రుతులు లేకుండా పలికిందామె.

"అబ్బ, వెంటనే ఎంత చక్కగా అనేసిందో. చేరింది ఈ రోజే అయినా మొదటి సరళీస్వరం మూడు కాలాల్లో పలకడానికి వారం రోజులు పట్టింది గదే మనకు!" గుసగుసగా అనుకున్నారు అక్కడున్న అమ్మాయిలు కొందరు, సంగీత వైపు ఆసక్తిగా చూస్తూ.

అర గంట సేపు ఆ స్వరాన్నే మళ్లీ చెప్పించారు మాస్టారు సంగీతతో. మిగిలిన అర గంటా కబుర్లతో కాలక్షేపం చేయించారు మాస్టారు. పాఠం చెప్పే కాలం రోజు కొక గంట. పేరుకు గంటే కానీ, చెప్పేది అర గంట కూడా వుండేది కాదు.

ఒక రోజు వీణ, మరొక రోజు గాత్రం. అలా వుండేది పాఠం చెప్పడం.

పది సరళీస్వరాలు, జంట స్వరాలు, అలంకారాలూ, స్వరజతులూ, గీతాలూ, వర్ణాలూ నేర్చుకోవడం పెద్ద కష్టంగా ఏమీ అనిపించలేదు సంగీతకు.

సంగీతజ్ఞానం చిన్నతనం నుంచే వుందామెలో. వాళ్ల అమ్మమ్మ పాడే అధ్యాత్మరామాయణకీర్తనలూ, తల్లీ, తండ్రీ శుక్రవారాలు అమ్మవారి వద్ద పాడే పాటలూ, పసితనం నుంచీ వినడం వల్ల చక్కగా పాడే జ్ఞానం కలిగింది ఆమెకు. ఒకటి రెండు సార్లు వింటే చాలు, కష్టంగా వున్న ఏ బాణీ అయినా సరే, ఠక్కున పట్టేసేది.

పెద్దయింతర్వాత స్కూల్లో, కాలేజీలో మంచి గాయనిగా పేరు తెచ్చుకున్నది సంగీత. కానీ శాస్త్రోక్తమైన సంగీతాన్ని అభ్యసించాలని కలలు గనేదామె.

బాలమురళీకృష్ణ, ఎం.ఎస్ సుబ్బులక్ష్మి, ఎం.ఎల్. వసంతకుమారి, డి.కె. పట్టమ్మాళ్‌ల గాత్రపుతీరు లంటే మక్కువ.

విదేశీయుడైనా భారతీయ కర్ణాటక సంగీతంలో నిష్ణాతుడైన జాన్ హిగ్గిన్స్ భాగవతార్ ఆమెకు ఆదర్శం.

వాళ్లందరిలాగా సంగీతవిద్వాంసురాలు కావాలనే కోరిక ఆమె అంతరాంతరాలను తొలుస్తుండేది.

కానీ, తండ్రి గతించడంతో, బంధువుల దయాదాక్షిణ్యాలతో బ్రతకవలసిరావడం వల్ల, చదువుకోవడమే ఘనమైపోయింది. ఆ తర్వాత కుటుంబపోషణార్థం ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంగీతం నేర్చుకోవాలనే తహతహ మాత్రం ఆమెను వదల్లేదు.

ప్రస్తుతం ఆర్థికంగా స్వతంత్రురాలు కాబట్టి ఏదో ఒక ఖర్చు తగ్గించుకుని అయినా సరే, సంగీతం నేర్చుకోవాలని నిశ్చయించుకున్నది.

ఆ ఊళ్లో వున్న కొందరు సంగీతకారుల్లో శేషాచార్యులు గారు సంగీతం బాగా చెప్పగలరని తెలియడంతో, వారి వద్ద సంగీతం నేర్చుకోవడానికి ఉపక్రమించిందామె.

"రఘువంశసుధాంబుధిచంద్ర శ్రీ..."ని మాస్టారితో సమానంగా కలిసి వీణపై వాయిస్తోంది రేఖ.

రేఖ వాళ్లు చాలా డబ్బు గలవారు. వాళ్ల అమ్మా, నాన్నా అప్పుడప్పుడూ మంచి నేయి, స్వీట్లు రెండు మూడు డబ్బాల్లో తెచ్చి మాస్టారికిచ్చి, ఆయనను బాగా పొగిడి వెళ్లేవాళ్లు.

"అబ్బెబ్బే ఎందుకండీ ఇవన్నీనూ..." అంటూ మొహమాటంగానే తీసుకునేవారు మాస్టారు.

రేఖ ప్రోగ్రెస్ గురించి ఆమె తల్లిదండ్రులడిగితే, "దానికేమండీ బంగారం! ఇట్లా చెప్పగానే అట్లా అల్లుకుపోగలదు" అంటూ ఆకాశాని కెత్తేసేవారు రేఖను.

000

స్వరాలూ, గీతాలూ, వర్ణాలూ, కృతులూ అంటూ నాలుగు భాగాలుగా విభజించారు విద్యార్థినులను.

తన బాచ్‌లో కొంత మంది తనతో కలిసేదాకా తర్వాత పాఠం చెప్పేవారు కాదు సంగీతకు మాస్టారు.

వృథా కాలయాపన వల్ల నిరాశగా అనిపించేదామెకు. ఆర్థికమైన ఇబ్బందులు లేనివారు కాలయాపనకు తట్టుకోగలరేమో కానీ, మాస్టారు నేర్పుతున్న సంగీతం త్వరగా ఒంటబడుతున్నప్పుడు ఎందుకలా చేస్తారు మాస్టారు? అనిపించేదామెకు, తను నెల నెలా డబ్బు కట్టడానికి ఎంత ఇబ్బంది పడుతూందో గుర్తొచ్చి.

ఈ రోజు పాఠం చెబుతారో లేక పోచికోలు కబుర్లతో కాలక్షేపం చేస్తారోనని ఏ రోజు కారోజు గండంలా వుండేది కానీ, హాయిగా అనిపించేది కాదామెకు.

వాళ్ల గేదెల గురించీ, అవి పేడ వేసే విధానం గురించీ వాళ్లకు లేకలేక కలిగిన కొడుకు లోకాయి గురించీ, సాటి సంగీతం మాస్టార్ల సంగతులూ, ఇలా ఎన్నో అర్థం పర్థం లేని సంగతులతో కాలం గడిపే వా రాయన.

ఆయనకు డబ్బు రావడం ముఖ్యం. దాని కోసం పాఠాలు సాగదీసి కాలాన్ని పొడిగించాలి. అదీ సంగీత లాంటి మధ్యతరగతి వాళ్ల మీదే ఆయన ప్రయోగం. రేఖ లాంటి డబ్బున్నవాళ్ల వద్ద ఆయన పప్పులుడకవు. వాళ్లంటే భయం. అంటే డబ్బు మీద గౌరవం. డబ్బు లేకపోతే డబ్బుకు కొరగాని లోకంలో అనిపించేది సంగీతకు.

000

"పరాకేల సరస్వతీ...!"

శ్రీగిరిరాజు విజయలక్ష్మి

పాడుతున్నది సంగీత ఒక రోజు శ్రుతి బాక్స్‌తో శ్రుతి వేసుకుంటూ, ఒక్కో సంగతీ విడివిడిగా పలుకుతూ.

అప్పుడే మాస్టారి కోసం ఎవరో వచ్చారు. "ఎవరా అమ్మాయి? తారస్థాయిలో పంచమాన్ని అంత చక్కగా అనగల్గుతున్నది! కంఠం కూడా అద్భుతంగా వుంది" అన్నారాయన.

'మంద్రస్థాయిలో కూడా అంత బాగామా అనగలదు' అంటారేమో మాస్టారు' అనుకున్నది సంగీత. కానీ "ఆ... ఫలానా ఆఫీసులో పన్చేస్తుంది" అంటూ నాన్చారు మాస్టారు.

అదే రేఖ లాంటి పలుకుబడీ, డబ్బుగలవా రమ్మాయైతే పొగిడి పొగిడి కీర్తించేవారే. 'గురువులు పొగడకూడదు కానీ ప్రతిభ గలవారిని గురించి కాస్త ప్రోత్సాహకరంగా మాట్లాడితే తప్పు లేదు కదా!' అనిపించిందామెకు.

మాస్టారెప్పుడూ మాటలతో క్రుంగదీసే వారామెను. "అందంగా, బొమ్మలా వీణ పట్టుకు కూర్చుంటావు గానీ, కదలికే లేదు" అంటూ నిరుత్సాహపరిచేవారు, అలా అనాల్సిన అవసరం లేకపోయినా.

వీణ మీద పడిపోతూ, పూనకం వచ్చినట్టు ఊగిపోయే కదలికలు ఆమె కనిష్టం. మరీ రాయిలా బిగుసుకుపోకుండా గమకానికి తగ్గట్టు పాడేటప్పుడు కాస్త కదలిక వుంటే చాలని ఆమె అభిప్రాయం.

000

"తెలిసి రామచింతనతో నామమూ, సామజవరగమనా, ఎంత నేర్చినా, సంగీతజ్ఞానమూ... భక్తి వినా" మొదలైనవి తనకూ నేర్పమని అడిగింది మాస్టార్ని సంగీత, రేఖ, రాధ, రాణీవాళ్లకు నేర్పుతుంటే. మాస్టారెంత తొక్కిపెట్టినా, కాలయాపన చేసినా ప్రస్తుతం కృతుల విభాగంలోకి అడుగు పెట్టింది కాబట్టి.

"నీకేం వస్తాయని? సంగీతసముద్రాన్ని అంత తొందరగా ఒక్కసారే మథించాలన్న తొందరైతే ఎట్లాగే నీకు? వాటిల్లో కొన్ని స్పీడుగా పాడాల్సివస్తాయి. నీవేం పాడగలవు?" అంటూ నలుగురి మధ్యా మాస్టారు చులకనగా మాట్లాడేసరికి అవమానభారంతో తల భూమిలోకి క్రుంగిపోతే బావున్ననిపించింది సంగీతకు.

సంగీతం మానేస్తే బాగున్ననిపించింది మొదటిసారిగా. టైపు నేర్చుకోవడమూ, ఆఫీసులో పనీ, సంగీతం క్లాసులకు రావడమూ, మళ్లీ సాధనా, క్షణం విశ్రాంతి లేకుండా అయింది. తరచూ జ్వరం వస్తుండేది. తల్లి కోప్పడేది సంగీతం మానెయ్యమని. ఆ డబ్బు దేనికో ఒకదానికి వస్తాయనేది.

000

ఒక రోజు...

కలవారమ్మాయి, ఆస్థమా పేషెంట్ జానకికి 'రాగాలాపన' ఎలా చేయాలో బోధిస్తున్నారు మాస్టారు. తనకూ, హరికాంభోజి, దేవమనోహరి, ఖమాస్, శుద్ధధన్యాసి, హంసధ్వని, పుష్పలతిక, నాటకురంజి, బేగడ, సామ, బౌళి మొదలైన రాగాలతో చాలానే కృతులు నేర్పారు కాబట్టి, 'జానకి ఎంత కష్టపడుతున్నదో. తనకైతే అలా అనిపించకపోను' అనుకున్న సంగీత, ఇంటికి రాబోయే ముందు, "మాస్టారూ! నాకూ నేర్పరా?" అని ఆసక్తిగా, జాలిగా అడిగింది.

"నీకా? అప్పుడే రాగాలాపనా, స్వరకల్పనలూనా? మరో రెండేళ్లు పడుతుంది నీవా స్టేజికి రావాలంటే. అయినా నేర్పేవాడిని నాకు తెలియదా, ఎవరి కెప్పుడు ఏది నేర్పాలో. నీది మరీ ఆకాశానికి నిచ్చెనలు వేసే వ్యవహారం లాగుందే చూస్తే? ఇట్లా చాలాసార్లు నన్నెదిరించావ్, ఇలా అయితే నా దగ్గర కుదరదు... మానెయ్యొచ్చు!" గట్టిగా అరిచారు మాస్టారు ఉక్రోషంగా.

'అవును, ఎందుకు కుదురుతుంది? నేతి డబ్బాలూ, వగైరాలు మీ ఇంటికి చేరవేయలేదుగా మరి? నేను చక్కగా పాడగలిగినా సాటివాళ్లు ఇంకా నేర్చుకోలేదని ఒక్కో విభాగంలో పాతేసి వుంచేవారు. ఏ నాడూ ప్రోత్సహించేలా మాట్లాడకపోయినా, వ్యంగ్యవాక్కులతో క్రుంగదీశారు, కదలిక లేదు, అది లేదు, ఇది లేదు అంటూ. వృద్ధిలోకి రావాలన్న నా ఆకాంక్షను మీరు ఎప్పటికప్పుడు తుంచుతూనే వచ్చారు. గురువు లెప్పుడూ శిష్యుల చురుకుదనాన్ని బట్టి విద్య నేర్పాలి గానీ, వారి ఆర్థికస్తోమతను బేరీజు వేసుకుని కాదు! శిష్యులు తమను మించిపోతారని ఏ గురువైనా అణగద్రొక్కటం చేస్తే విద్వాంసు లెక్కడ తయారవుతారు మాస్టారూ, ఊబిలో కూరుకుపోతారు గానీ...!' అని పైకనలేదు, సభ్యత అడ్డొచ్చి. ఆయన మానెయ్యమని తెగేసి అన్న తర్వాత ఇంకా క్లాసులకు రావటమూ కష్టమే. ఉబికి వస్తున్న కన్నీటిని బలవంతంగా ఆపుకుంటూ, తడబడే అడుగులతో గేటు బయటి వరకూ వచ్చి, ఒక్క సారి వెనుదిరిగి చూసింది మాస్టారి వైపు-'ఇంత వరకైనా సంగీతజ్ఞానం కలిగించిన మీకు నా కృతజ్ఞతలు. సెలవు' అనే భావన కన్నుల్లో కదలాడగా.

000

సంగీతజ్ఞానమే భగవంతుని దరి చేరే సాధనమని నమ్మి, ఎన్ని ఒడిదొడుకు లెదురైనా వివాహం కూడా చేసుకోకుండా శేషజీవితాన్ని సంగీతసాధనలో తరింపజేసుకోవాలనీ, విద్వాంసురాలవ్వాలనీ కలలు గన్న ఆమె ఆశల వటవృక్షం, గురువు నిరాదరణతో కూకటివేళ్లతో కూలిపోయింది. ■



'సంగీతజ్ఞానమూ...' నాకెంతో నచ్చిన కథ. ఈ కథలో ముఖ్యపాత్ర పేరు సంగీత. ఆమె సంగీతజ్ఞానం కోసం తపన పడ్డ వైనం కథ. త్యాగరాజకృతి 'సంగీతజ్ఞానమూ... భక్తి వినా' అనేది వుంది. అంటే కథలో నాయిక పేరుకూ, సంగీతజ్ఞానానికీ, ఈ కృతికీ అవినాభావసంబంధంవుంది. ఎందరో పెద్ద రచయిత్రులు పోటీలో వున్నప్పటికీ నా కథకు ప్రథమస్థానాన్నిచ్చి-విలువలను గ్రహించిన ఆ నాటి పత్రికాధిపతులను మరవలేను. దీనికే పతివాడ సుధాకర్ స్మారకబహుళమతి కూడా రావటం విశేషం.

ఈ నాడు పురస్కారాలకు పాట్లు పడాలి. ఆ నాడు విలువలకే ప్రాధాన్యం. అందుకే నాకెంతో ఆనందాన్నీ, తృప్తినీ కలుగజేసిన ఇది నాకెంతో నచ్చిన కథ. ఇది 1986లో ఆంధ్రజ్యోతి వీక్లీలో ప్రచురితమైంది.

రచయిత్రి